క్లుప్తంగా

సెలవు రోజుల్లో తరగతులా?

గిద్దలూరు రూల్: పట్టణంలోని జీవనజ్యోతి కళాశాల యాజమాన్యం దసరా సెలవుల్లో తరగతులు నిర్వహించడం సరైన పద్ధతి కాదని ఎస్ఎఫ్ఐ నాయకుడు డి.తేజ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులకు పాఠాలు చెప్పడాన్ని తప్పుబట్టారు. ఈ విషయమై విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బాధ్యతలు చేపట్టిన గిద్దలూరు సబ్ రిజిస్ట్రార్

గిద్దలూరు రూరల్: గిద్దలూరు సబ్ రిజిస్ట్రార్‌గా ఎస్.కృష్ణమోహన్ సోమవారం స్థానిక రిజిస్ట్రేషన్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అమ్మనబ్రోలులో విధులు నిర్వర్తిస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా గిద్దలూరులో నియమితులయ్యారు. కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సబ్సిడీ శనగలకు దరఖాస్తుల ఆహ్వానం

తర్లుపాడు: రబీ సీజన్‌కు సంబంధించి సబ్సిడీపై శనగలు పొందేందుకు రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఏఓ వెంకటేశ్వర్లు సూచించారు. 20 కేజీల బ్యాగ్‌కు 1410 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని, ఒక ఎకరాకు 40 కేజీల విత్తనాలు సబ్సిడీపై అందిస్తున్నట్లు తెలిపారు. ఆధార్‌కార్డు, పొలం పాసుబుక్ జిరాక్స్‌లతో రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సోమవారం ఓ ప్రకటనలో సూచించారు.

10న సర్వసభ్య సమావేశం

కంభం: ఈనెల 10వ తేదీన స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వీరభద్రాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నిశాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని సూచించారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు సమావేశంలో పాల్గొనాలని కోరారు.

నేటి నుంచి వార్డు మెంబర్లకు శిక్షణ

మార్కాపురం రూరల్: గ్రామ పంచాయతీల్లో ఉప సర్పంచ్, ఇద్దరు వార్డు మెంబర్లకు మంగళ, బుధవారాల్లో శిక్షణ ఇస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ భాగ్యవతి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్లో శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.


రైతు భరోసా కేంద్రం


బయట మార్కెట్‌లో విక్రయానికి సిద్ధం చేసిన విత్తనాలు

రాయితీ విత్తనం.. సర్కారు చిత్తం!

- సబ్సిడీ విత్తనాల పంపిణీని పట్టించుకోని ప్రభుత్వం
- రబీ సాగు కోసం అధిక ధరకు విత్తనాలు కొనాల్సిన దుస్థితి
- అన్నదాత సుఖీభవ పథకంపై సర్కారు పిల్లిమొగ్గలు
- పెట్టుబడి సాయం కోసం ఆశగా ఎదురు చూస్తున్న రైతులు


అధిక ధరకు అలసంద విత్తనాలు కొని విత్తుతున్న రైతు

కొనకనమిట్ల:

ఖరీఫ్ సీజన్‌లో అరకొరగా గడ్డి జొన్నలు పంపిణీ చేసి చేతులు దులుపుకొన్న ప్రభుత్వం రబీ సాగుకు అవసరమైన విత్తనాలు పంపిణీ చేయడంలోనూ అంతే అలసత్వం ప్రదర్శిస్తోంది. టీడీపీ కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి 4 నెలలు పూర్తి కావస్తున్నా పెట్టుబడి సాయం ఊసెత్తడం లేదు. గత ఏడాదికి సంబంధించి పంటల బీమా పరిహారాన్నీ గాలికొదిలేశారు. దీనికి తోడు విత్తన పప్పు శనగపై అందించే రాయితీని 40 శాతం నుంచి 25 శాతానికి సర్కారు కుదించడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పైగా రాయితీ విత్తనాలు సక్రమంగా పంపిణీ చేయకపోవడంతో రైతులే నేరుగా అధిక ధర వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తోంది.

రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తామంటూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఖరీఫ్‌లో సాగు చేసే పత్తి, కంది, సజ్జ, వరి విత్తనాలను రాయితీపై ప్రభుత్వం సరఫరా చేయకపోవటంతో రైతులు బయట మార్కెట్‌లో కొనుగోలు చేశారు. తాజాగా రబీ సీజన్ ప్రారంభమైనా సబ్సిడీపై విత్తనాలు సక్రమంగా అందించేందుకు కార్యాచరణ రూపొందించలేదు. దీంతో రైతులు రబీ సాగు కోసం అలసంద(బొబ్బర్లు), మినుము, వేరుశనగ, ఆముదం, కొర్ర, వరి, మిర్చి విత్తనాలను అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం మినుములు, అలసంద విత్తరాలు కిలో రూ.100కు రైతులు కొనుగోలు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేశారు. కానీ ప్రస్తుత పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలు మార్పు చేసేందుకు ఉత్సాహం చూపిన ప్రభుత్వానికి.. రైతులకు సేవలందించాలన్న సోయ లేకపోవడంపై విమర్శలొస్తున్నాయి. సేవా లోపం కారణంగా రైతు సేవా కేంద్రాలు బోసిపోయినట్లు కనిపిస్తున్నాయి. రైతుల కోసం ఏమీ చేయకుండా 'ఇది మంచి ప్రభుత్వం' అంటూ ఇంటింటికీ స్టిక్కర్లు అంటించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ముందు చూపు ఏదీ?

రబీలో మార్కాపురం వ్యవసాయ సబ్ డివిజన్‌లో సుమారు 30 వేల ఎకరాల్లో పలు రకాల పంటలు సాగు చేస్తారు. గిద్దలూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లోనూ సుమారు 25 వేల ఎకరాల్లో పంటలు సాగవుతాయి. ఈ నేపథ్యంలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను సిద్ధం చేసి ఇప్పటికే పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాల్సిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టలేదు.

బయట మార్కెట్‌లో కొనగోలు చేస్తున్నాం



ప్రభుత్వం రైతులకు రాయితీపై ఎరువులు, విత్తనాలు సరఫరా చేయడం లేదు. పంటల సాగుకు అదును కావడంతో ఎక్కువ ధరకు విత్తనాలు, ఎరువులు బయట మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్నాం. గత ప్రభుత్వంలో రాయితీపై విత్తనాలు సకాలంలో అందించారు. మరిప్పుడు ఇలా ఎందుకు జరుగుతుందో అర్థం కావడం లేదు.

– వెన్నా రామిరెడ్డి, రైతు

అన్నదాత సుఖీభవ ఏమైంది?



అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు ఏటా రూ.20 వేలు ఇస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్న చంద్రబాబు నాలుగు నెలలుగా రైతు సంక్షేమాన్ని పట్టించుకోకపోవం ఆయన పనితీరుకు నిదర్శనం. ఈ ఏడాది ఖరీఫ్ ముగిసి రబీ సీజన్ మొదలైంది. ఇప్పటికీ అన్నదాత సుఖీభవ నిధులు వస్తాయో రాదో తెలియడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు పంటలు సాగు చేస్తున్నారు. ఇంతవరకు సబ్సిడీ విత్తనాలు ఇవ్వకపోవటంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.

– కె.కోటేశ్వరరావు, రైతు సంఘ నాయకుడు

ఇక మా వల్ల కాదు..


రెడ్డినగర్ వద్ద పైపులైన్ లీకేజీ


ఎంపీడీఓ కార్యాలయం వద్ద పైపులైన్ పగిలి లీకవుతున్న నీరు

- బేస్తవారిపేట ఓవర్ హెడ్ ట్యాంక్ ఫైప్ లైన్‌కు తరచూ లీకులు
- ఇప్పటికే 70 సార్లు మరమ్మతులు చేశామని చెబుతున్న పంచాయతీ సిబ్బంది
- నూతన ఫైప్‌లైన్ వేస్తేనే సమస్యకు పరిష్కారం
- లీకేజీల కారణంగా గృహాలకు కలుషిత నీరు సరఫరా

బేస్తవారిపేట: ఓ పైప్‌లైన్‌కు ఒకటీ రెండు పర్యాయాలు కాదు ఏకంగా 70సార్లు మరమ్మతులు చేసిన పంచాయతీ సిబ్బంది విసుగెత్తిపోయారు. స్థానిక గీతా మందిరం నుంచి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు మంచినీటి సరఫరాకు కోసం వేసిన పైపులైన్ శిథిలావస్థకు చేరింది. నిత్యం ఏదో ఒకచోట పగిలిపోతోంది. పైపులైన్‌కు మరమ్మతులు చేసిన మరుసటి రోజే మరో చోట పైపులైన్ దెబ్బతింటోంది. ఇప్పటికే జెడ్పీ బాలుర హైస్కూల్ వద్ద నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు సుమారు పది చోట్ల లీకులున్నాయి. పైపులైన్ పగిలినచోట మురుగు తటాకాన్ని తలపిస్తూ ఆ నీరు తిరిగి పైపులైన్‌లోకి చేరుతోంది. దుర్వాసనతో నీరు వస్తుండటంతో గృహ అవసరాలకు ఉపయోగించుకోవడానికి ఇబ్బందికరంగా మారింది. పగిలిన పైపులైన్‌కు సుమారు 70 సార్లు మరమ్మతులు చేశామని, పైపులైన్ కొత్తది వేస్తేకాని సమస్య పరిష్కారం కాదని పంచాయతీ సిబ్బంది చెబుతున్నారు. అయితే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకుండా తూతూమంత్రంగా మరమ్మతులు చేసి వదిలేస్తున్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంపీడీఓ కార్యాలయ వీధి, వాల్మీకినగర్, పాత కోఆపరేటీవ్‌వీధి, జెడ్పీ బాలుర హైస్కూల్ వీధి, నాయిబ్రాహ్మణవీధి, తహసీల్దార్ కార్యాలయ వీధులకు ఈ ఓహెచ్‌ఆర్ నుంచి వచ్చే నీరు సరఫరా అవుతుంది. మురుగునీరు పైపుల్లోకి చేరడంతో నీరు దుర్వాసన వస్తోందని, కొత్త పైపులైన్ వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బాధ్యతలు స్వీకరించిన సర్వేయర్

గిద్దలూరు రూరల్: గిద్దలూరు నూతన సర్వేయర్‌గా ఆంజనేయులు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కొమరోలు మండల సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనను ప్రభుత్వం గిద్దలూరు మండలానికి బదిలీ చేసింది. ఈ సందర్భంగా ఆయనను రెవెన్యూ సిబ్బందితోపాటుగా గ్రామ సర్వేయర్లు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.


నూతన సర్వేయర్‌ను సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పొదిలి: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ టి.వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై వేమనతో కలిసి సైబర్ నేరాలపై పలు సూచనలు చేశారు. అనుమానిత ఫోన్ కాల్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు ఓటీపీ నంబర్లు చెప్పవద్దన్నారు. 'ప్రభుత్వ శాఖల నుంచి అధికారులం మాట్లాడుతున్నాం, మీకు సంక్షేమ పథకాలు వస్తాయి' అని మోసగాళ్లు నమ్మిస్తారని, ఏమీ నిర్ధారించుకోకుండా వారికి వ్యక్తిగత వివరాలు తెలియజేయవద్దన్నారు. ఫోన్ కాల్స్ ద్వారా ఎవరైనా ఒత్తిడి తెచ్చినా, భయాందోళనకు గురి చేసేలా మాట్లాడినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

కరాటేతో ఆత్మవిశ్వాసం పెంపు

మార్కాపురం: కరాటే నేర్చుకోవడం వల్ల విద్యార్థులు స్వీయ రక్షణతోపాటు ఆత్మవిశ్వాసం పొందవచ్చని సీపీఐ ప్రాంతీయ కార్యదర్శి అందె నాసరయ్య పేర్కొన్నారు. మార్కాపురం పట్టణంలోని ఎమ్మెస్సార్ స్పోర్ట్స్ కరాటే స్కూల్లో సోమవారం బెల్ట్ గ్రేడింగ్ టెస్టులు నిర్వహించారు. కరాటే చీఫ్ ఎగ్జామినర్ ఎం.శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పోటీల్లో 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. నాసరయ్య చేతులమీదుగా విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు అందించి అభినందనలు తెలిపారు.


సర్టిఫికెట్లు చూపుతున్న విద్యార్థులు

లైసెన్స్ లేని బాణసంచా దుకాణాలు సీజ్

- డీఎస్పీ నాగరాజు హెచ్చరిక

మార్కాపురం: మార్కాపురం డివిజన్‌లో లైసెన్స్ లేకుండా బాణసంచా విక్రయించే దుకాణాలను సీజ్ చేస్తామని డీఎస్పీ యు.నాగరాజు హెచ్చరించారు. సోమవారం ఆయన మార్కాపురం పట్టణంలోని పలు దీపావళి దుకాణాలను సీఐ సుబ్బారావుతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన లైసెన్సులు, భద్రతా ప్రమాణాలు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. దీపావళి పండుగను పురస్కరించుకుని టపాసులు అమ్మేవారు పోలీసు శాఖ నుంచి లైసెన్స్ తీసుకోవాలని స్పష్టం చేశారు.

స్క్రాప్ వ్యాపారులూ జాగ్రత్తా..

ఇనుము, స్క్రాప్ కొనే వ్యాపారులు జాగ్రత్తలు పాటించాలని సీఐ సుబ్బారావు హెచ్చరించారు. ప్రభుత్వానికి సంబంధించిన ఆస్తులు, కరెంటు తీగలు, విద్యుత్ మోటార్ల వైర్లు కొనే విషయంలో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో పట్టణ ఎస్సై సైదుబాబు ఉన్నారు.


దీపావళి దుకాణాలను తనిఖీ చేస్తున్న డీఎస్పీ నాగరాజు, పక్కన సీఐ సుబ్బారావు

నిమ్మ తోటల పునరుద్ధరణపై అవగాహన

పొదిలి: మండలంలోని కంభాలపాడులో నిమ్మ సాగు చేసే రైతులకు తోటల పునరుద్ధరణపై శిక్షణ, అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. దర్శి ఉద్యానవన పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్రబాబు మాట్లాడుతూ.. తోటల పునరుద్ధరణలో భాగంగా ముందుగా ఎండు కొమ్మలు, అవసరం లేని కొమ్మలు తొలగించాలన్నారు. చెట్టును గొడుగు ఆకారంలో చేయడం ద్వారా గాలి, సూర్యరశ్మి సోకి చీడపీడలు ఆశించడం తగ్గుతుందన్నారు. ముదురు చెట్లతో పెరుగుదల ఉండాలంటే, పచ్చిరొట్ట ఎరువులు వేసి, పూతదశకు వచ్చిన సమయంలో కలియదున్నాలన్నారు. ఉద్యానవన అధికారి ప్రత్యూష మాట్లాడుతూ.. ఎనిమిదేళ్ల కంటే ఎక్కువ వయసు కలిగిన నిమ్మతోటల పునరుద్ధరణకు ఎకరాకు రూ.6950 అందిస్తున్నట్లు చెప్పారు. ఉద్యానవన శాఖ స్ప్రేయర్లు, మినీ ట్రాక్టర్లు రాయితీపై అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఎస్కే జైనులాబ్దిన్, ఉద్యానవన విస్తరణాధికారిణి బి.ధనలక్ష్మి, వ్యవసాయ సహాయకులు సునీత, రైతులు పాల్గొన్నారు.


నిమ్మ తోటలను పరిశీలిస్తున్న ఉద్యానాధికారులు, శాస్త్రవేత్తలు

మీనాక్షిదేవిగా వాసవీ మాత


గిద్దలూరు : కనకదుర్గమ్మ ఆలయంలో మహాచండిగా..


బేస్తవారిపేట : గజలక్ష్మీ దేవిగా వాసవీమాత


బేస్తవారిపేట : రాజరాజేశ్వరీ దేవిగా కోటసత్యమాంబదేవి


సోమవారిపేటలో చండీ దేవిగా చౌడేశ్వరీదేవి


తర్లుపాడులో మహా చండీదేవి అలంకారంలో..


పొదిలి : ధనలక్ష్మీదేవిగా వాసవీ మాత

గిద్దలూరు రూరల్: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు మీనాక్షిదేవి అలంకరణలో సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. అద్దాల మండపంలోని ఊయలలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. నల్లబండ బజారులోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు లలితాత్రిపురసుందరిదేవిగా, కాశినాయన కుంట ఆవరణలోని గాయత్రిమాత ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మీ రూపంలో, వీరన్నబావి సమీపంలో ఉన్న కాశికాంబ ఆలయంలో అమ్మవారు పార్వతీదేవిగా, నరవ రోడ్డులోని కాశినాయన కుంట కట్ట మీద గల కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు మహాచండి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గజలక్ష్మీదేవిగా కన్యకాపరమేశ్వరి

బేస్తవారిపేట: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారిని గజలక్ష్మీదేవిగా, కోటసత్యమాంబదేవి ఆలయంలో రాజరాజేశ్వరీదేవిగా, సోమవారిపేటలోని చౌడేశ్వరీదేవి ఆలయంలో చండీదేవిగా అలంకరించారు. పాపాయిపల్లె, బేస్తవారిపేట పోలేరమ్మ ఆలయాల్లో అమ్మవారికి నిత్యపూజలు నిర్వహించారు.

గజలక్ష్మి అలంకరణలో

కంభం: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక అమ్మవారిలో వాసవీ మాత గజలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

తర్లుపాడు: మండలంలోని నాగేళ్లముడుపు రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరీ అలంకారంలో సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. తర్లుపాడులోని రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో అమ్మవారిని మహా చండీదేవిగా అలంకరించి పూజలు చేశారు. అనువంశిక ధర్మకర్త భాస్కర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు రామాలయం, కొనకనమిట్ల రామదూతక్షేత్రం, పెదారికట్ల శివాలయం, మహాలక్ష్మమ్మాలయం, రేగడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో అమ్మవారిని మహాలక్ష్మీ, సరస్వతీ దేవి, స్కందమాతగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. నందనమారెళ్లలోని బాలత్రిపుర కోటేశ్వరస్వామి ఆలయంలో చండీయాగం, రుద్రయాగం నిర్వహించారు.

ధనలక్ష్మీదేవిగా వాసవీ మాత

పొదిలి: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు ధనలక్ష్మీ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. శాశ్వత, పుష్పాలంకరణ ఉభయదాతలు పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు జీసీ సుబ్బారావు, వెంకట కృష్ణమూర్తి, యక్కలి శేషగిరిరావు, కంకణాల రమేష్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కంభాలపాడు అంకాల పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

స్కందమాతగా పార్వతీదేవి

మార్కాపురం టౌన్: దసరా నవరాత్రుల్లో భాగంగా మార్కాపురం పట్టణంలోని వివిధ ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మార్కండేశ్వర స్వామి ఆలయంలో పార్వతీదేవి స్కందమాతగా భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని పూజించారు. శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారు గజలక్ష్మి అలంకారంలో, శివాలయంలో సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ముద్దసానమ్మకు అభిషేకాలు

మార్కాపురం రూరల్: మండలంలోని జమ్మనపల్లి వద్ద ముద్దసానమ్మ దేవస్థానంలో అర్చకులు అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు గొలమారి వీరారెడ్డి, మాలపాటి అంకాళరెడ్డి, టంగుటూరి భాస్కర్‌రావు, గార్లపాటి రామకృష్ణారావు, మేడా శ్రీనివాసరావు, పెసల వెంకట జనార్దన్, సూరె శ్రీకాంత్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


నాగేళ్లముడుపులో రాజరాజేశ్వరి అలంకారంలో..


గొట్లగట్టు రామాలయంలో..


పొదిలి : కంభాలపాడులో అన్నపూర్ణదేవిగా..


పెదారికట్లలో..


మార్కాపురం శివాలయంలో జ్ఞానసరస్వతీదేవిగా..


అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

వాహనదారులు నిబంధనలు పాటించాలి


పత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

పొదిలి: దర్శి రోడ్డులో సోమవారం స్పెషల్ స్క్వాడ్ అధికారులు వాహనాలు తనిఖీ చేశారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తున్న ఆటో వాలాలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వాహనాల పత్రాలను స్క్వాడ్ అధికారి భాను ప్రకాశ్ పరిశీలించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని చెప్పారు. ఫిట్‌నెస్‌లేని బస్సులపైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఐదు వాహనాలపై కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

రూరల్ పోలీసుస్టేషన్ తనిఖీ

మార్కాపురం రూరల్: మార్కాపురం రూరల్ పోలీసుస్టేషన్‌ను డీఎస్పీ నాగరాజు సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్రైం రికార్డులు, జనరల్ డైరీని పరిశీలించారు. ఎన్‌బీడబ్ల్యు(నాన్ బెయిలబుల్ వారెంటు), ఇతర పెండింగు కేసుల వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రౌడీషీటర్లు, పాత నేరస్తులపై నిఘా ఉంచాలని, గ్రామాల్లో అనధికారికంగా మద్యం అమ్మేవారిని గుర్తించి అరెస్టు చేయాలని ఆదేశించారు.


రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ నాగరాజు

ఘనంగా మేరీమాత జయంతి


మేరీమాత రథోత్సవంలో పాల్గొన్న క్యాథలిక్‌లు

మార్కాపురం: మార్కాపురం రైల్వేస్టేషన్ రోడ్డులోని ఆర్‌సీఎం చర్చిలో సోమవారం మేరీమాత జయంత్యుత్సవాలను ఫాదర్ ఆర్ఎం జాన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన నెల్లూరు మేత్రాసనం వికార్ జనరల్, ఫాదర్ మణి మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు తల్లి అయిన మేరీమాత జయంతిని క్యాథలిక్‌లు ఒక ప్రత్యేకమైన పండుగగా నిర్వహించుకుంటారని పేర్కొన్నారు. జపమాలతో మేరీమాతకు ప్రార్థన చేయడం వల్ల విజ్ఞత, వినమ్రత, రక్షణ కలిగి పాపాలు తొలగిపోతాయని చెప్పారు. మేరీ మాత రథోత్సవ కార్యక్రమాన్ని విశ్వాసులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పీటల్ ఫీలో అఖిల, శిరీష, ఉపదేశీ జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి వరకే మద్యం టెండర్ల గడువు


మాట్లాడుతున్న ఏఈఎస్ వెంకట్

పొదిలి: మద్యం దుకాణాల టెండర్లను దేశంలోని ఏ ప్రాంతం నుంచైనా వేసుకోవచ్చని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వెంకట్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 9వతేదీ సాయంత్రం ఐదు గంటలకు టెండర్ల సమయం ముగుస్తుందని స్పష్టం చేశారు. ఒక వ్యక్తి ఎన్ని టెండర్లు అయినా వేసుకోవచ్చని చెప్పారు. దుకాణాలు పొందిన వారు ఈ నెల 12వ తేదీ నుంచే విక్రయాలు ప్రారంభించుకోవచ్చన్నారు. సమావేశంలో సీఐ అరుణకుమారి, ఎస్సై సైమన్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు రాయవరం విద్యార్థులు

మార్కాపురం రూరల్: మండలంలోని రాయవరం ఎంజేపీఏపీ బీసీ వెల్ఫేర్ గర్ల్స్ హైస్కూల్ విద్యార్థినులు రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సన్నిధి సునీత సోమవారం తెలిపారు. ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు రాజమండ్రి సమీపంలోని రామచంద్రాపురంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. పీఈటీ రమాదేవి, విద్యార్థులను హెచ్‌ఎం అభినందించారు.


బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బేస్తవారిపేట: అర్ధవీడు మండలంలోని నాగులవరం జెడ్పీ హైస్కూల్లో సోమవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహంగా సాగింది. 2004–05 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు 20 ఏళ్ల తర్వాత విద్యా బుద్ధులు నేర్చుకున్న పాఠశాలలో కలుసుకున్నారు. చిన్ననాటి మిత్రులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు తెలుసుకుని సంతోషంగా గడిపారు. చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. అనంతరం గురువులను ఘనంగా సన్మానించారు.


గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు